క్లుప్తంగా

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



ప్రశంసాపత్రాలతో కళాకారులు

విజయనగరం టౌన్: రామనారాయణంలో విజయనగరంలోని తెలకలవీధి రామమందిరానికి చెందిన తమ్మిన సిస్టర్స్ బృందం శనివారం సాయంత్రం చేసిన భరతనాట్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. నృత్యం ఆద్యంతం వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. అనంతరం కళాకారులైన చిన్నారులు షణ్ముక ప్రియా, సాహితీప్రియా, నందిని, రమ్యశ్రీ, మేఘన, జోషిత, లక్ష్మి, ఉదయశ్రీ, జస్మితలకు ప్రశంసాపత్రాలు అందజేసి నిర్వాహకులు సత్కరించారు.

నేటి నుంచి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

విజయనగరం: నగరంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నుంచి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ ప్రభుత్వ మోసాలు వివరించడమే లక్ష్యంగా చేపట్టే ఈ కార్యక్రమం వార్డుల వారీగా నిర్వహిస్తామన్నారు. 27వ తేదీన 5, 29వ డివిజన్‌లలో, 28న 11, 12, 40వ డివిజన్‌లలో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

గురుకులాన్ని వేధిస్తోన్న తాగునీటి సమస్య

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని ఎంజేపీ ఏపీ గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో అక్కడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం 700 మంది విద్యార్థులు ఉండగా వారంతా 20 రోజులుగా నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ కేబీబీ రావు వద్ద సాక్షి విలేకరులు ప్రస్తావించగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సోదర భావంతో మెలగాలి



బుచ్చెంపేట గ్రామస్తులతో సమావేశమైన సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: గ్రామాల్లో ప్రజలంతా సోదర భావం, ప్రశాంత వాతావరణంతో మెలగాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. ఇటీవల పట్టణ పరిధి బుచ్చెంపేట గ్రామంలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈ నేపథ్యంలో ఆ ఇరువర్గాలు, గ్రామస్తులతో శనివారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్నవిషయాలకు తగాదాలు పడవద్దని, ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని చెప్పారు. యువత చెడువ్యసనాలకు బానిసకాకుండా పెద్దలు నివారించాలని సూచించారు. అలాగే మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దని చెప్పారు. ఎస్‌ఐ వై.రవికిరణ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక రింగురోడ్డులో టౌన్ సెంటర్ లేఅవుట్‌లో కొలువైన శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి 24వ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీనివాస సేవా సంఘం కార్యదర్శి చెరుకూరి శ్రీధర్ తెలిపారు. ఇదే విషయమై శనివారం ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. అంకురార్పణతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు సెప్టెంబరు 24న స్వామివారు గజవాహనంపైన తిరువీధి, 25న తోమాలసేవ, హనుద్వాహనంపై తిరువీధి, 26న వసంతోత్సవం, శేషవాహనంపై ఊరేగింపు, 27న వైభవ శ్రీనివాస వ్రతం, పూల పల్లకిలో తిరువీధి, 28న సుదర్శన హోమం, ముత్యాల పల్లకిలో తిరువీధి, 29న అష్టదళ పాదపద్మార్చన, సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు, 30న గరుడ వాహనంపై ఊరేగింపు, పండిత వైదిక సదస్యం, అక్టోబరు 1న రథోత్సవం, 2న వెంకటేశ్వరస్వామి తిరునక్షత్రం సందర్భంగా శ్రవణోత్సవం, కొట్నాల ఉత్సవం, చక్రతీర్థం, పూర్ణాహుతి, శ్రీపుష్పయాగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బ్రహోత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు శ్రీహరి దీక్ష భక్తులకు ఇవ్వనున్నామన్నారు. దీక్ష తీసుకోవాలనుకునే వారు ఆలయంలో ముందుగానే సంప్రదించాలని కోరారు. అనంతరం ఉత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు భోగరాజు సూర్యలక్ష్మి, శివరామకృష్ణ, గొరునాయుడు, శైలజ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు, మోసాలతోనే కూటమి పాలన

- 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు



కూటమి పాలనపై మండిపడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: అబద్దాలు, మోసాలతో కూటమి పాలన కొనసాగుతోందని, అధికారంలోకి వచ్చిన ఏడాదికే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎ.రావివలస, గూడెపువలస, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, కొండ్రాజుపాలెం, ముక్కాం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన..అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తూ ప్రజలను కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. అలాగే అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు, ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలియజేశారు. ఆ తర్వాత ఇదే కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో జరిగిన రచ్చబండ సమావేశాల్లో పాల్గొని, కూటమి కుతంత్ర, కుయుక్త రాజకీయాలపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకుల మోసపూరిత హామీలను నమ్మి ఓట్లు వేసిన జనానికి అధికారంలోకి వచ్చిన తర్వాత దగా చేయడం దుర్మార్గమన్నారు. అధికారమే పరమావధిగా అమలు సాధ్యం కాని హామీలిచ్చి, ఇప్పుడు రాష్ట్ర ఖజానా లేదని పథకాలు ఇవ్వకుండా చేతులెత్తేసే పరిస్థితికి ఆ పార్టీ నాయకులు చేరుకున్నారని ధ్వజమెత్తారు.

సూపర్ సిక్స్..మోసం ఫిక్స్..

సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు మోసం ఫిక్స్ చేసిన ఘనుడు చంద్రబాబు అని, ఆయనను మళ్లీ మళ్లీ నమ్మి మోసపోతున్నామని ప్రజలే గోల పెడుతున్నారన్నారు. ఏ గ్రామం వెళ్లి చూసినా వైఎస్సార్ సీపీ హయాంలో వేసిన రోడ్లు, కాలువలే కనిపిస్తున్నాయని, అప్పుడు కట్టిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, తాగునీటి ట్యాంకులే కనిపిస్తున్నాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంతవరకు ఏ ఒక్క పథకమూ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇప్పటివరకు అరకొరగా ఇచ్చిన గ్యాస్, తల్లికి వందనం పథకాల్లో మోసమే కనిపిస్తోందన్నారు. ఎన్నికలప్పుడు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అన్నారని, తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామన్నారని అయితే ఇప్పుడు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లే ఇస్తున్నారని, తల్లికి వందనం కూడా రూ.13 వేలే ఇస్తున్నారని ఇది కాదా మోసం అని నిలదీశారు. చాలా మంది గ్యాస్ డబ్బులు పడలేదని, తల్లికి వందనం డబ్బులు పడలేదని చెబుతున్నారన్నారు.



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, పార్టీ నాయకులు

మిగతా పథకాలెప్పుడిస్తారు?

ఎన్నికలప్పుడు ప్రజలకు లెక్కలేనన్ని హామీలు ఇచ్చారని, అవెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, కొత్త పెన్షన్లు, నిరుపేదలకు ఇళ్లు వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం సాధారణమైపోయిందన్నారు. తానేం చేసినా చెల్లుతుంది..ఏం చెప్పినా జనం నమ్ముతారన్న భ్రమలో చంద్రబాబు అండ్ కో ఉన్నారని, వారి మోసాలను రానురాను ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన లబ్ధికి, ఇప్పుడు జరుగుతున్న లబ్ధికి బేరీజు వేసుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో వారే కూటమికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఏడాదిలో ఎన్ని ఉద్యోగాలిచ్చారు?

స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి కూడా ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ ప్రజలకు ముఖ్యంగా యువతకు ఉద్యోగాలిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వంద రోజుల్లో వంద కంపెనీలు తెచ్చి ఉద్యోగాలిస్తామన్నారని, ఇంతవరకు ఎంతమందికి ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కారు, ఆ పార్టీల నాయకుల మోసపూరిత మాటలు మరోసారి నమ్మకూడదని జనమంతా అనుకుంటున్నారని, రానున్న రోజుల్లో ఓటుతో వారికి బుద్ధి చెప్పాలని అంటున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, అంతవరకు ప్రజల తరఫున పోరాడుతూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, హౌసింగ్ బోర్డు రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, జెడ్పీటీసీ ప్రతినిధి భానుప్రకాష్, వైస్ ఎంపీపీలు రావాడ బాబు, గురునాథ్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సుందర హరీష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహంతి జనార్ధన్, సర్పంచ్‌లు ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పట్నాల తాతయ్యలు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, నాయకుడు అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం రాజులకు అప్పగించడం దుర్మార్గం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

విజయనగరం గంటస్తంభం: పాత ఆస్పత్రి వద్ద ఉన్న రైతుబజారు స్థలం పక్కా ప్రభుత్వ స్థలమని దానిని రాజులకు అప్పగించడం దుర్మార్గమని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు ఖండించారు. ఇదే విషయమై ఆయన స్థానిక ఎల్బీజీ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రైతుబజార్ స్థలం కాపాడడమే లక్ష్యంగా ప్రజామద్దతు కోరుతూ ఈ నెల 28వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతుబజారు భూమి 22ఏలో నుంచి తప్పించి ఆ భూమిని రాజులకు అప్పగించడమేంటని ప్రశ్నించారు. సంస్థానాల అధీనంలోని రైతుబజారు భూమి.. సంస్థానాల రద్దు తర్వాత ప్రభుత్వం భూమిగా మారిందని గుర్తు చేశారు. 1948లో జమీందారీ వ్యవస్థ రద్దు చేసి భూములన్నీ రైత్వారీ పద్ధతిలోకి రావడం జరిగిందని తెలిపారు. 1968లో ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తర్వాత ప్రభుత్వం చేతిలోనూ మాన్సాస్ ట్రస్ట్ చేతిలోనూ ఆ భూములు ఉన్నాయన్నారు. రాజుల చేతిలో ప్రత్యేకంగా భూములేమీ లేవన్నారు. ఆ భూములు తమవని చీకటి జీవోలు తెచ్చి అశోక్ గజపతిరాజు, వారి వారసులు కలిపి భూములన్నీ కాజేయాలని చూస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే జీవో నంబరు 124 తెచ్చి రైతు బజారు తాలూకా 1.48 ఎకరాల భూమి కాజేశారన్నారు. అధికారం ఉందని ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా మార్చడమేంటని నిలదీశారు. జొన్నగుడ్డిలో పేదలకు పట్టాలు ఇచ్చిన భూమిని అక్కడి దళితులకు ఎందుకివ్వరని ప్రశ్నించారు. గవర్నర్ గిరి సరిపోలేదా రైతుబజార్ కావాల్సి వచ్చిందా అని ప్రశ్నించారు. నగరంలోని చారిత్రాత్మక కట్టడాలైన ఎమ్మార్ కాలేజి, మహారాజా ఆస్పత్రి, సంగీత కళాశాల, సింహాచలం మేడ ఇవన్నీ కూడా తీసుకోరన్న గ్యారెంటీ ఏమిటన్నారు. ఇప్పటికైనా రైతుబజార్ పాత ఆస్పత్రి వద్దనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో శ్రీలక్ష్మి



దెంకాడ: పీఏసీఎస్ గొడౌన్‌లో ఎరువుల వివరాలు పరిశీలిస్తున్న ఏవో సంగీత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడలో ఉన్న ఎరువుల షాపుల్లో మండల వ్యవసాయాధికారిణి శ్రీలక్ష్మి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు వాటిలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు ఉన్నవీ లేనివీ పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువుల విక్రయాలు జరగాలని, ఎవరైనా అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎరువులు 220 టన్నులు, డీఏపీ 150 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. నానో యూరియా, డీఏపీ వినియోగంతో 6 శాతం దిగుబడి పెరుగుతుందని, పర్యావరణానికి కూడా మంచి జరుగుతుందన్నారు. రైతుల అవసరం మేరకు 700 టన్నుల యూరియా, 500 టన్నుల డీఏపీకి ఇండెంట్ పెట్టామన్నారు.

దెంకాడ: మండల కేంద్రంలోని ఎరువుల షాపులు, పీఏసీఎస్ గొడౌన్‌ల్లో ఏవో టి.సంగీత శనివారం తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యూరియా 60.50 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా బదులుగా నానో యూరియా, డీఏపీకి బదులుగా నానో డీఏపీ వాడాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రామకోటి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశోధనలు అవసరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రాణి

నెల్లిమర్ల రూరల్: ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశోధనలు అవసరమని డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.రాణి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో శనివారం జరిగిన అంతర్జాతీయ సెమినార్ ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరై కాసేపు మాట్లాడారు. కోవిడ్ మహమ్మారి ముందు, తర్వాత పరిస్థితులను గమనిస్తే ప్రపంచ జీవన గమనంలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ప్రజలంతా స్మార్ట్ జీవితానికి అలవాటు పడ్డారన్నారు. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహకారంతో 24 వేల మందికి ఎక్సరేలు తీశామన్నారు. విద్యార్థుల పరిశోధనలకు ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి ఓ శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో వీసీ పీకే మహంతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జోగినాయుడు

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు నిరంతరం ఆటంకం ఏర్పడుతోందని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాఠాలు బోధించకుండా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్య ప్రైవేటీకరణను ప్రభుత్వ యంత్రాంగమే నేరుగా ప్రోత్సహిస్తోందని, ఫలితంగా ప్రభుత్వ నిధులతో నడుస్తున్న వివిధ యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యాబోధన సాఫీగా కొనసాగని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు ప్రభుత్వం బోధనేతర పనులు అప్పగిస్తోందని, తద్వారా విద్యాబోధన సరిగా జరగడం లేదన్నారు. సంక్షేమ పథకాల అమలు, పుస్తకాల పంపిణీ, శిక్షణా తరగతులు ఏటా ఏప్రిల్ నెలాఖరున గానీ జూన్ రెండో వారంలో గానీ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

మ్యుటేషన్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్: నగర పరిధిలో ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు తీసుకువచ్చిన మ్యుటేషన్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మ్యుటేషన్ ప్రక్రియపై ప్రజలను చైతన్యం చేయాలన్న దానిపై సచివాలయ అడ్మిన్, కార్యదర్శులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ భూములు, భవనాల రిజిస్ట్రేషన్ అనంతరం ఆస్తి వివరాలు, ఆటో మ్యుటేషన్ ప్రక్రియకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో పేరు మార్పులవుతాయన్నారు. పురపాలక శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయంతో ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత ఆస్తిని పురపాలక రికార్డుల్లో నేరుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. ఆస్తి వివరాలు, పన్నుల నమోదు ఆటోమేటిక్‌గా చేరుతాయన్నారు. దీని వల్ల ఆస్తిదారుల సమయం ఆదాతో పాటు అవినీతి రహిత సేవలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైన్యంలో చేరి దేశసేవ చేయండి



మాజీ సైనికులను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి కోరారు. మండలంలోని టెక్కలి యూనివర్సిటీలో కార్గిల్ విజయ్ దివస్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పాకిస్థాన్‌పై జరిగిన యుద్ధంలో మన దేశం సాధించిన విజయానికి గుర్తుగా ఏటా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, సైనికుల త్యాగాలను స్మరించుకుని స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ మహంతి

విజయనగరం టౌన్: కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా స్థానిక జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో వార్ మెమోరియల్ వద్ద అమరవీరులైన సైనికులకు నేతాజీ అసోయేషన్ సభ్యులు నివాళులర్పించారు. ప్రతి పౌరుడూ దేశభక్తి కలిగి ఉండాలని, దేశసేవకు ఎప్పుడూ ముందుండాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణ తెలిపారు. అనంతరం దేశానికి సేవలందించిన మాజీ సైనికులను అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు.

గంజాయి తాగుతున్న ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బాబామెట్ట వద్ద గంజాయి సేవిస్తూ ఇద్దరు యువకులు పోలీసులకు శనివారం పట్టుబడ్డారు. నాకా బందీలో భాగంగా సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ కనకరాజు తన బృందంతో కలిసి రింగ్‌రోడ్డు, దాసన్నపేట, నీళ్లట్యాంకు, పూల్‌బాగ్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేయగా పి.రాజేష్, బి.సందీప్‌లను పట్టుకుని కోర్టుకు తరలించామన్నారు. పట్టుబడిన వారిలో సందీప్‌ది పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు అని ఎస్‌ఐ తెలిపారు.

సమాజ సేవకు ముందుకురావాలి



విరాళం అందజేస్తున్న హెచ్‌ఎం కామేశ్వరి

నెల్లిమర్ల: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవకు ముందుకురావాలని హెచ్ ఎం .కామేశ్వరి కోరారు. మండలంలోని జరజాపుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు లెప్రసీ బాధితుల కోసం సేకరించిన విరాళం(రూ.5,215)ను లెప్రా సొసైటీ ఫండ్ రెయిజింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు శనివారం అందజేశారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని, వారి వైద్యం, ఆరోగ్యం మెరుగుకు సహాయ సహకారాలు అందివ్వాలని హెచ్‌ఎం విజ్ఞప్తి చేశారు. జిల్లాలో లెప్రా సొసైటీ ప్రభుత్వ మహారాజా ఆస్పత్రిలో జిల్లా కుష్టు నివారణ అధికారి సహకారంతో బాధితులకు అంగవైకల్యం నివారణకు రిఫరెల్ సెంటర్ ద్వారా సేవలందిస్తున్నట్లు రమణ తెలిపారు. ఇందులో భాగంగానే బాధితులకు ఉచితంగా పాదరక్షలు, సెల్ఫ్ కేర్ కిట్‌లు, ఫిజియోథెరపీ సేవలందించనున్నామని, దీనికోసం విరాళాలు సేకరిస్తున్నామని చెప్పారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలి



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, సభ్యులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాల నిర్వహణ వంటి బోధనేతర పనులతోనే ఉపాధ్యాయుల విధులు సరిపోయాలని పాఠ్యాంశాలు చెప్పలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు విద్యామిత్ర కిట్ల పంపిణీ, యాప్‌లలో సమాచారం అప్‌లోడింగ్ వంటివి చేస్తున్నామని దీంతో రోజంతా బోధనలకు సంబంధం లేని పనులకే సమయం సరిపోతోందన్నారు. యాప్‌ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్‌లో అనేక రకాల సమాచారం అప్‌లోడ్ చేయమని ఒత్తిడి చేస్తున్నారన్నారు. కింది స్థాయి అధికారుల ఒత్తిడిని ఉపాధ్యాయులు తట్టుకోలేకపోతున్నారని బదిలీలు జరిగి నెలరోజులు గడిచినా వందల మంది ఉపాధ్యాయులు ఇప్పటికీ రిలీవ్ కాలేదన్నారు. దీంతో ఐదుగురు ఉపాధ్యాయులు అవసరమున్న పాఠశాలల్లో ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారన్నారు. బదిలీల ఉత్తర్వుల్లో చేసిన మార్పులకు ఆర్థిక శాఖ అనుమతి ఇంకా పొందలేదని, క్యాడర్ సమస్యలు, పొజిషన్ ఐడీల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విద్యాశాఖ ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జేఆర్‌సీ పట్నాయక్, కోశాధికారి భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, శ్రీదేవి, సీహెచ్ తిరుపతినారుడు, సత్యనారాయణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.